

వైభవంగా ఆర్జిత సేవలు

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. స్వర్ణసంపెంగలతో పూజ చేశారు 8లో



ఎర్నిమాంబకు దశమి పూజలు

జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారికి జ్యేష్ఠమాస శుద్ధ దశమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు 8లో



ఇంటర్ అడ్మిషన్ల జోష్

ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు రావటంతో జూనియర్ కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. 8లో

న్యూస్‌రీల్

ఘనంగా మోదకొండమ్మ పండగ



మోదమ్మ ఘటాల ఊరేగింపులో పాల్గొన్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఇతర నాయకులు

సాక్షి,పాడేరు: మండలంలోని మినుములూరులో మూడు రోజుల పాటు నిర్వహించే మోదకొండమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంతబయలు వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం,పాదాలు,ఘటాలను కొలువుదీర్చి ఉత్సవాలను ప్రారంభించారు. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొనడంతో పాటు మోదకొండమ్మతల్లి పాదాలు,ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మినుములూరు పంచాయతీ ప్రజలు ఈఏడాది కూడా మోదకొండమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్ లంకెల చిట్టమ్మ,జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కూడా సురేష్ కుమార్,కిల్లు కోటిబాబు, సర్పంచ్‌లు బసవన్నదొర, లక్ష్మణరావు, మాజీ సర్పంచ్‌లు మినుముల కన్నాపాత్రుడు, శరభ సూర్యనారాయణ,పాంగి నాగరాజు, పాంగి సత్తిబాబు పాల్గొన్నారు.

మూడో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మూడో విడత చందనం అరగదీత ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 22న జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఆరోజు స్వామికి సమర్పించే మూడు మణుగుల (120 కిలోలు) పచ్చిచందనం సమకూర్చేందుకు ఈ అరగదీత కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం ఏడు గంటల నుంచి 15 మంది నాల్గవ తరగతి సిబ్బంది చందనం అరగదీతను ప్రారంభించారు. తొలిరోజు ఆదివారం 35 కిలోల చందనాన్ని అరగదీశారు. ఇంకా మూడు రోజులపాటు చందనం అరగదీత కార్యక్రమం జరగనుంది. కాగా ఏడాదిలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నాలుగు విడతలుగా మూడేసి మణుగుల పచ్చి చందనాన్ని సమర్పిస్తారు. చందనోత్సవం నాడు రాత్రి, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో తెల్లవారుజామున మూడేసి మణుగుల చొప్పున చందనాన్ని సమర్పిస్తారు. ఇప్పటికే గడిచిన చందనోత్సవం రోజు, వైశాఖ పౌర్ణమి రోజు రెండు విడతలు చందనం సమర్పణ పూర్తయింది.

రేపు సాయంత్రం 6 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లభిస్తాయని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. స్వామివారి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం జరగనుండడంతో ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష



కృష్ణా కాలేజీలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట(విశాఖ) : నగరంలో ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లోపరీక్ష జరగ్గా సంబంధిత ఏర్పాట్లను విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పర్యవేక్షించారు. కృష్ణా కాలేజీ,ఎంవీపీ కాలనీలోని గాయత్రీ కాలేజీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రిలిమినరీ పరీక్షకు మొత్తం 9,735 మంది దరఖాస్తు చేసుకోగా 4,677 మంది హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, లైజన్ అధికారులు, ఇతర అధికారులు పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆంధ్రా టు ఒడిశా..

తాబేళ్ల అక్రమ రవాణా

- నెల రోజుల వ్యవధిలో రెండు కేసులు నమోదు
- ఒడిశా ప్రాంతంలో డిమాండ్‌తో ఇక్కడ నుంచి తరలింపు

రంపచోడవరం: మన రాష్ట్రం నుంచి ఒడిశాకు తాబేళ్ల అక్రమంగా రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడ తక్కువ రేటుకు తాబేళ్లను కొనుగోలు చేసి కొంత మంది ఒడిశా ప్రాంతానికి రవాణా చేస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలోని కొన్ని గ్రామాల్లో తాబేళ్లకు మంచి డిమాండ్ ఉండడంతో అంబేద్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలోని మంచినీటి చెరువుల్లో లభించే తాబేళ్లను కొనుగోలు చేసి గుట్టు చప్పుడు కాకుండా వాహనాల్లో రవాణా చేస్తున్నారు. అక్రమంగా రవాణా అవుతున్న తాబేళ్లను ఈ నెలలోనే రెండు సార్లు అటవీ అధికారులు పట్టుకున్నారు.

సీలేరు నది దాటించి ఒడిశా ప్రాంతంలోకి...

ఒడిశా ప్రాంతంలో బెంగాలీలు తాబేళ్ల మాంసాన్ని ఇష్టంగా తింటారు. దీంతో కొంత మంది వ్యాపారులు తాబేళ్ల రవాణాను వ్యాపారంగా మలుచుకుని ఏడాది పొడవున అటవీ శాఖ చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కళ్లుగప్పి ఒడిశా ప్రాంతానికి తరలిస్తున్నారు. గత నెల 16 తేదీన వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 1,589 తాబేళ్లను పోక్సుపేట రేంజ్ పరిధిలోని పోక్సుపేట అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. నెల రోజుల వ్యవధిలో శుక్రవారం అక్రమంగా కారులో తరలిస్తున్న మరో 397 తాబేళ్లను పోక్సుపేట చెక్‌పోస్టు సమీపంలోని సుద్దగొమ్మి వద్ద రేంజర్ కరుణాకర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వారంలో మూడు నుంచి నాలుగు రోజులు తాబేళ్ల అక్రమ రవాణా జరుగుతున్నట్టు తెలుస్తోంది. కేవలం ముందస్తు సమాచారంతోనే అటవీ అధికారులు కాపు కాసి పట్టుకోగలుగుతున్నారు.ఇతర జిల్లాల్లో తాబేళ్ల



అటవీ అధికారులు ఇటీవల స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

అక్రమ రవాణా, కొనుగోళ్లపై అటవీ అధికారులు దృష్టి సారించకపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. షెడ్యూల్ -1 పరిధిలోకి తాబేళ్ల రావడంతో వీటి రవాణాపై నిషేధం ఉంది. తాబేళ్ల అక్రమ రవాణాకు పాల్పడితే ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు. కఠిన శిక్షలు ఉన్నా అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ. 40 నుంచి రూ.50 వరకు కొనుగోలు..

అక్రమ రవాణాకు పాల్పడే వ్యాపారులు అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తాబేళ్లను రూ. 40 నుంచి రూ. 50 వరకు కొనుగోలు చేస్తున్నారు. వీటిని ఒడిశా ప్రాంతంలో రూ. 350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. పలు చెక్‌పోస్టులు దాటుకుంటు తాబేళ్ల అక్రమ రవాణా జరుగుతోంది. తూర్పుగోదావరి జిల్లాలోని బూరుగుపూడి, గోకవరం, ఏజెన్సీ ముఖద్వారంలోని పోక్సుపేట,రంపచోడవరం, తులసిపాకల వద్ద చెక్‌పోస్టులున్నాయి. వాటిని దాటుకుని లక్కవరం జంక్షన్ మీదుగా గొట్లగూడెం, కొత్తపల్లి చేరుకుని దోనెలపై తాబేళ్లను సీలేరు నది దాటించి ఒడిశా ప్రాంతానికి తరలిస్తున్నారు. మరోమార్గంలో చింతూరు చేరుకుని మోటు మీదుగా ఒడిశాకు తరలిస్తున్నారు. తాబేళ్లను తరలించే క్రమంలో అనేక



స్వాధీనం చేసుకున్న తాబేళ్లను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నరేంధిరన్

ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గట్టి నిఘా



రాజమహేంద్రవరం సర్కిల్ అధికారులు అక్రమ రవాణాను నిరోధించేందుకు ఇతర జిల్లాల డీఎఫ్‌వోలను సమన్వయ పరుచుకుని చర్యలు తీసుకుంటున్నారు. ఏజెన్సీలో తాబేళ్ల అక్రమ రవాణా, వన్య ప్రాణుల వేటను నిరోధించేందుకు డీఎఫ్‌వో నరేంధిరన్ ఆధ్వర్యంలో నిఘా బృందాలు పని చేస్తున్నాయి. కఠిన చర్యలతో అక్రమ రవాణాకు అడ్డుకట్టవేస్తున్నాం.

– కరుణాకర్, రేంజ్ అధికారి, పోక్సుపేట

పిడుగుల మోత



ఇందుకూరుపేటలో పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు

- మూడు మండలాల్లో 26 మూగజీవాల మృతి
- పలు ప్రాంతాల్లో భారీ వర్షం



సూకురులో పిడుగుపాటుకు గురై మృతి చెందిన పశువులు

హుకుంపేట/దేవీపట్నం/చింతపల్లి రూరల్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షం కురవడంతో పాటు పిడుగుల మోత మోగింది. పిడుగుపాటుకు గురై వేర్వేరు ప్రాంతాల్లో 26 మూగజీవాలు మరణించాయి. హుకుంపేట మండలం సూకురు సమీపంలో పిడుగు పడడంతో 13 పశువులు మరణించాయి. సూకురు గ్రామానికి చెందిన పశువులను శనివారం గ్రామ సమీపంలోని కొండపైకి మేతకు తీసుకువెళ్లారు. మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడడంతో కాపరులు భయాందోళనకు గురై, పశువులను అక్కడే వదిలి ఇళ్లకు చేరుకున్నారు. ఇంతలో పిడుగులు పడడంతో పాతుని బొంజుబాబు, పాతుని కొండబాబు, పరదాని లక్ష్మీపతి, గడుతురి చిట్టపడల్, కిముడు నాగేశ్వరరావు, పాంగి భైరవమూర్తి అనే గిరిజన రైతులకు చెందిన పశువులు మృతి చెందాయి. ఆదివారం ఉదయం కొండపైకి వెళ్లిన గ్రామస్తులు మృత్యువాత పడిన పశువులను చూసి ఆవేదన చెందారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. స్థానిక సర్పంచ్ దనసాని సత్యవతి బాధితులను పరామర్శించారు.

- దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో ఆదివారం మధ్యాహ్నం పిడుగుపడి పది మేకలు, గొర్రెలు మృతి చెందాయి.ఇందుకూరుపేట గ్రామానికి చెందిన పోతల అన్నవరం, దుర్గారావుకు చెందిన మేకలు,గొర్రెలు పొలాల్లో మేతకు వెళ్లిన సమయంలో పిడుగుపడడంతో మృతిచెందాయి. తమకు ఆధారమైన మేకలు మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.



లక్కవరంలో మృతిచెందిన మూగజీవాలు

- చింతపల్లి మండలంలో కిటుముల పంచాయతీ లక్కవరంలో ఆదివారం పిడుగులు పడి రెండు పశువులు,ఒక మేక మృతి చెందాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి తనకు ఆదుకోవాలని బాధితుడు పంతల రాజబాబు కోరాడు.

ఇల్లు దగ్ధం

చింతూరు: మండలంలోని కాటుకపల్లిలో ఆదివారం పిడుగుపడి సోడె నాంచారమ్మ అనే గిరిజన మహిళ ఇల్లు దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులు వెంటనే తేరుకుని బయటకు పరిగెత్తడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో ఇంట్లోని రూ.80 వేల నగదు, రూ.50 వేల విలువైన బంగారం, ధాన్యం, నిత్యావసరాలు, సామగ్రి కాలిపోయాయి. తక్షణసాయం కింద బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందించినట్టు తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు. సర్పంచ్ సవలం సత్తిబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు బాధిత కుటుంబానికి రూ. 12,600 నగదు, మూడు క్వింటాళ్ల బియ్యం అందించి బాసటగా నిలిచారు. జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ బాధిత కుటుంబానికి రూ.10 వేల నగదుతో పాటు బియ్యం, నిత్యావసర సరకులను అందజేశారు.



పిడుగుపాటుకు దగ్ధమైన ఇల్లు



బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్

గిరి శిఖర గ్రామాల అభివృద్ధికి కృషి

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

అనంతగిరి: గిరి శిఖర గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలోని మారుమూల పెదకోట పంచాయతీ పాటిపల్లి, బంధకొండ, చీడిపల్లి గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా ఆయనకు గిరిజనులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నపై ఉన్న అభిమానంతో నియోజకవర్గ ప్రజలు అత్యధిక మెజార్టీతో తనను గెలిపించారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అభివృద్ధికి పాటుపడతానన్నారు. అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల అభివృద్ధిపై ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికలను రూపొందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు స్వాభి రామ్మూర్తి, కిల్లో మీనా, వైఎస్సార్‌సీపీ నాయకులు సాంబ, డేవిడ్, వెంకటరావు, శ్రీను పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో

అడ్మిషన్లకు రంగం సిద్ధం

- వచ్చేవారం జాతీయ మెడికల్ కౌన్సిల్ పర్యటన
- వైద్య విద్య,ఉన్నత వైద్యానికి జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు
- కార్పొరేట్ స్థాయిలో 420 బెడ్‌లు ఏర్పాటు
- అందుబాటులో ప్రొఫెసర్లు, టెక్నికల్ సిబ్బంది



పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రి



ఆస్పత్రిలో కార్పొరేట్ సౌకర్యాలతో రోగుల బెడ్‌లు

సాక్షి,పాడేరు: జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు త్వరలో జరిగే కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయించనున్నారు. గిరిజనులకు ఉన్నత వైద్యం, వైద్యవిద్య లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాడేరులో రూ.500కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టారు. 35 ఎకరాల విస్తీర్ణంలో భవన నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. ఇవి పూర్తయ్యేందుకు సమయం పట్టే అవకాశం ఉన్నందున జిల్లా సర్వజన ఆస్పత్రికి అదనంగా రెండు అంతస్తుల భవనంతో పాటు బెడ్‌లు,ఆపరేషన్ థియేటర్, అన్ని సౌకర్యాలను సమకూర్చి బోధనాస్పత్రి నిర్వహించేందుకు వీలుగా తీర్చిదిద్దారు. ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ పరిశీలన తరువాత ప్రవేశాలు కల్పించే అవకాశం ఉంది.

పూర్తిస్థాయి సౌకర్యాలు

సూపర్ స్పెషాలిటీ వైద్యం,వైద్యవిద్యకు సంబంధించి గత ప్రభుత్వం రూ.4కోట్ల వ్యయంతో కార్పొరేట్ స్థాయిలో జిల్లా సర్వజన ఆస్పత్రిలో సౌకర్యాలను కల్పించింది. అదనంగా రెండు అంతస్తుల భవనంతో పాటు 420 బెడ్‌లు, ఆపరేషన్ థియేటర్ సమకూర్చింది.అన్ని వైద్య విభాగాలకు వేర్వేరుగా రోగుల గదులతో పాటు వైద్య పరికరాలు,ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు,అసిస్టెంట్ ప్రొఫెసర్లు,వైద్య నిపుణులు, టెక్నికల్ సిబ్బంది ఏడు నెలల నుంచి విధుల్లో ఉన్నారు.గత ప్రభుత్వం మెడికల్ కళాశాలను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

వచ్చే వారం జాతీయ మెడికల్ కౌన్సిల్ పరిశీలన

జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చిన సూపర్ స్పెషాలిటీ సేవలు, 420బెడ్‌లు, ఫ్యాకల్టీ, ఇతర అన్ని సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జాతీయ మెడికల్ కౌన్సిల్ వచ్చే వారం పాడేరులో పర్యటించనుంది. ఈమేరకు ఏర్పాట్లలో మెడికల్ కళాశాల,జిల్లా ఆస్పత్రి అధికారులు నిమగ్నమయ్యారు.జాతీయ మెడికల్ కౌన్సిల్ అధికారులు పరిశీలన అనంతరం మెడికల్ కళాశాలలోని అడ్మిషన్లకు అనుమతులు జారీ చేసే అవకాశం ఉంది.

జిల్లా సర్వజన ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న పోస్టుల వివరాలు

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్–1
- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్–1
- ప్రొఫెసర్లు–8 మంది
- అసోసియేట్ ప్రొఫెసర్లు–17 మంది
- అసిస్టెంట్ ప్రొఫెసర్లు–31 మంది
- టెక్నికల్,నర్సింగ్ సిబ్బంది 101 మంది

పరిశీలన పూర్తయితే అనుమతులు



జాతీయ మెడికల్ కౌన్సిల్ పరిశీలన కోసం ఎదురుచూస్తున్నాం. జిల్లా సర్వజన ఆస్పత్రి కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందింది. రోగులకు 420 బెడ్‌లతో పాటు అన్ని వసతులను అందుబాటులోకి తెచ్చాం.అన్ని విభాగాల వైద్య నిపుణులు ఇప్పటికే విధుల్లో నిమగ్నమయ్యారు.జాతీయ మెడికల్ కౌన్సిల్ ఇక్కడ సౌకర్యాల పరిశీలించిన అనంతరం మెడికల్ కళాశాల ప్రారంభానికిఅనుమతులువస్తాయని ఆశిస్తున్నాం. గిరిజనుల మెడికల్ కళాశాల కల సాకారమవుతుంది.

– డాక్టర్ హేమలతాదేవి, ప్రిన్సిపల్, మెడికల్ కళాశాల,పాడేరు

భారీగా తునికాకు దగ్ధం



కాలిబూడిదైన తునికాకు బ్యాగులు



ఏడుగురాళ్లపల్లిలోని తునికాకు గోడౌన్

చింతూరు: మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో ఓ గోడౌన్‌లో నిల్వ చేసిన తునికాకు(బీడీ ఆకు) ఆదివారం తెల్లవారుజామున దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.కోటిన్నర నష్టం వాటిల్లినట్టు అంచనా. 2022లో వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన తునికాకును సంబంధిత కాంట్రాక్టరు ఏడుగురాళ్లపల్లిలోని గోడౌన్‌లో నిలువ ఉంచారు. ఆదివారం తెల్లవారుజామున గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. ఉదయం గోడౌన్ నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపకశాఖ, అటవీశాఖ అధికారులు, పోలీసులకు, సమాచారమిచ్చారు. అగ్నిమాపకట శకటం వచ్చేసరికే గోడౌన్‌లోని సరకు పూర్తిగా దగ్ధమైంది. చింతూరు ఎస్‌ఐ శ్రీనివాసరావు, కూనవరం అటవీ రేంజ్ అధికారి మోహినీ విజయలక్ష్మి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. గోడౌన్‌లో మూడు గదులుండగా మొదటి గదిలో నిల్వ ఉంచిన ఏడుగురాళ్లపల్లి, కూనవరం, మురుమూరు, చింతూరు, కుందులూరు యూనిట్లకు చెందిన 612.473 స్టాండర్డు బ్యాగులు దగ్ధమయ్యాయి. రెండో గదిలోని నెల్లిపాక, మాధవరావుపేట, వీఆర్‌పురం, లక్కవరం యూనిట్లకు చెందిన 1,749.725 స్టాండర్డు బ్యాగులు, మూడో గదిలోని రుద్రంకోట, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 2,362 స్టాండర్డు బ్యాగులు కాలిపోయాయి.

సరకు రవాణాలో ఆర్టీసీ దూకుడు!

- జోన్–1లో గతేడాది కంటే 5 శాతం పెరిగిన ఆదాయం
- మరింత మంది పార్సిల్ బుకింగ్ ఏజెంట్ల నియామకం



ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్సిల్ రవాణా కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం : సరకు (కార్గో) రవాణాలో ఆర్టీసీ జోన్–1 దూకుడు ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలోని ఇతర జోన్లకంటే ముందుంది. గతేడాది కంటే ఐదు శాతం ఆదాయాన్ని అధికంగా ఆర్జించి రాష్ట్రంలో మొదటి స్థానంలో కొనసాగుతోంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఈ జోన్ పరిధిలో ఉన్నాయి. సరకు రవాణా ద్వారా ఈ జోన్‌కు గత ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ 15వ తేదీ వరకు రూ.4.72 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది అదే కాలానికి రూ.4.96 కోట్లను ఆర్జించింది. అంటే ఇది గతేడాదికన్నా ఐదు శాతం అధికమన్న మాట! ఇక జిల్లాల వారీగా పెరిగిన కార్గో ఆదాయాన్ని పరిశీలిస్తే అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా 17 శాతం, అల్లూరి సీతారామరాజు 16, అనకాపల్లి 8, విజయనగరం 6, విశాఖపట్నం 1, పార్వతీపురం మన్యం 1 శాతం చొప్పున ఉంది. వీటిలో పంటల విత్తనాలు, పాఠ్య, నోట్ పుస్తకాలను కంటైనర్ కార్గో, డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు (డీజీటీ) వాహనాల్లో రవాణా ద్వారా అధిక మొత్తం లభించింది. ఇంకా ఉత్తరాంధ్ర నుంచి హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని మరికొన్ని ప్రాంతాలకు జీడిపప్పు, గోధుమపిండి, ప్లైవుడ్ వంటివి రవాణా చేస్తున్నారు. అలాగే హైదరాబాద్ నుంచి ఇక్కడకు బుక్ చేసే సరకుల్లో బిస్కట్లు, ఆటోమొబైల్ స్పేర్ పార్టులు వంటివి ఉంటున్నాయి. ఇప్పటికే చాలావరకు పాఠశాలలకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులను ఆర్టీసీ లాజిస్టిక్స్ వాహనాల్లో రవాణా చేశారు. ఇంకా మిగిలి ఉన్న కొన్ని చోట్లకు త్వరలోనే పూర్తి చేయనున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలు కానుండడంతో రైతులకు అవసరమైన వివిధ రకాల విత్తనాలను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)లకు తరలిస్తున్నారు. ఇలా నెలాఖరు వరకు వీటిని రవాణా చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

డీఎంఈలతో సమావేశం

డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (డీఎంఈ)లకు మీటింగ్ పెట్టి జోన్‌లో పార్సిల్ బుకింగ్‌లు మరింతగా పెంచేందుకు ఆర్టీసీ కార్గో సేవల విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం డీఎంఈలతో వీరు ఇటీవల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జోన్ పరిధిలో పార్సిల్ బుకింగ్‌లను మరింత విస్తృతం చేయాలని, ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తూ ముందుకెళ్లాలని, వినియోగదార్లకు సేవల ద్వారా చేరువ కావాలని సూచించారు.

కొత్త ఏజెంట్లను నియమిస్తాం



సరకు రవాణా ఆదాయంలో రాష్ట్రంలోకెల్లా జోన్–1 నంబరు వన్ స్థానంలో ఉంది. గత ఏడాది కంటే ఐదు శాతం పెరుగుదలతో అగ్రస్థానంలో నిలిచింది. ఆర్టీసీ కార్గో రవాణా వ్యవస్థను మరింతగా మెరుగు పరచడం ద్వారా ఆదాయాన్ని పెంచాలని యోచిస్తున్నాం. ప్రస్తుతం జోన్‌లో ఆథరైజ్డ్ పార్సిల్ బుకింగ్ (ఏపీబీ) ఏజెంట్లు 52 మంది ఉన్నారు. నెల రోజుల్లో వీరి సంఖ్యను 62కి పెంచనున్నాం. భవిష్యత్తులో మండలానికో ఏపీబీ ఏజెంట్ చొప్పున విధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నాం. ఏపీబీ ఏజెన్సీ కోసం సిటీ పరిధిలో అయితే రూ.5 వేలు, రూరల్‌లో రూ. వెయ్యి మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు సమీపంలో డిపో అధికారులను సంప్రదిస్తే సరిపోతుంది.

– బలిజి అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్

క్లుప్తంగా

ఎర్నిమాంబకు దశమి పూజలు

కంచరపాలెం(విశాఖ) : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠమాస శుద్ధ దశమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 దర్శనాలు కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటావార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

నృసింహస్వామికి వైభవంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

– శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ఈద్–ఉల్–అద్హా నిర్వహణకు ఏర్పాట్లు
- ఈద్గాలతో పాటు మసీదుల్లోనూ ప్రార్థనలు
- సర్వ మానవాళి కోసం దువా చేయమన్న మతపెద్దలు


విద్యుత్‌దీపాలంకరణలో యాసీన్ మసీదు


ఇస్లాంపేటలోని మసీదు

పెదగంట్యాడ: త్యాగానికి ప్రతీక పవిత్ర బక్రీద్... ఈద్ ఉల్ అద్హా సోమవారం విశాఖ ఉమ్మ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఈద్గాలతో పాటు మసీదుల్లోనూ నమాజ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 6 గంటల నుంచే శుద్ధి స్నానం చేసి కొత్త దుస్తులు ధరించి.. అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్... లా ఇలాహ్ ఇల్లల్లా... హు అల్లాహు అక్బర్... అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్.. అంటూ తక్బీర్ చదువుకుంటూ ఈద్గాలకు చేరుకుంటారు. ఈద్ ఉల్ అద్హా కోసం ఈద్గాలకు వెళ్లలేని వారు సమీపంలోని మసీదులకు వెళ్లి ఈద్ నమాజు చేస్తారు. ఈద్గా, మసీదుల్లో నమాజు చేయించే ఖాజీలు, మౌల్వీలు తమ ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం దువా చేస్తారు. సర్వ మానవాళి శాంతి కోసం, జీవితంలో చేసిన పాపాల విముక్తి కోసం అల్లాహ్‌ను వేడుకుంటారు. నమాజ్, దువా అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ కరచాలనం, ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. కొందరు బక్రీద్ సందర్భంగా ఉపవాసాలు ఉంటారు. పండగ నేపథ్యంలో ఈద్గాలు, మసీదులను విద్యుత్‌కాంతులతో సిద్ధం చేశారు. ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండగల్లో బక్రీద్ ఒకటి...ధనిక పేద తారతమ్యం లేకుండా ఈ పండగను ఘనంగా నిర్వహించుకుంటారు. పవిత్ర త్యాగానికి ప్రతిరూపమైన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని ఈ సందర్భంగా ముస్లింలు స్మరించుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తర్వాత అంత ప్రాముఖ్యత ఉన్న పండగ ఈదుల్ అజహా (బక్రీద్) దీనిని త్యాగాల పండగ అని కూడా పిలుస్తారు.

ఖుర్బానీకి ప్రాధాన్యం

దేశ వ్యాప్తంగా ముస్లింలు సోమవారం బక్రీద్ పండగను జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తారు. ఒక గొర్రె పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. అందులో ఒక భాగాన్ని నిరుపేదలకు పంచిపెడతారు. మిగిలిన రెండు భాగాల్లో ఒక భాగాన్ని బంధువులకు మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీనినే ఖుర్బానీ అంటారు.

బక్రీద్ సందడి షురూ..

మార్కెట్లో బక్రీద్ సందడి షురూ మొదలైంది. పొట్టేళ్లు, గొర్రెలు, మేకల కొనుగోళ్లు ప్రారంభించారు. ఖుర్బానీ ఇవ్వడం కోసం గాజువాక పరిసర ప్రాంతాల నుంచి ఇప్పటికే పొట్టేళ్లను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. బక్రీద్ వస్తుదంటే వ్యాపారులకు గిరాకీ పెరుగుతుంది. వారం రోజుల నుంచి కొత్త బట్టలు కొనుగోలు చేస్తారు. పండగ సామగ్రిని సిద్ధం చేసుకుంటారు.

ప్రత్యేక ప్రార్థనలు

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఇస్లాంపేట, మదీనాబాగ్, పెదపాలెం, చినపాలెం, నడుపూరు తదితర ప్రాంతాల్లోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఆయా ప్రాంతాల్లో ఈద్ గావ్‌లకు తరలివెళ్లి ఈ ప్రార్థనలు చేస్తారు.

త్యాగ నిరతికి నిదర్శనం



బక్రీద్ పండగ మనిషికి దైవభీతి, త్యాగ నిరతిని తెలియజేస్తుంది. అందుకే దీనిని త్యాగాల పండగ అంటారు. చనిపోయిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని వారి పేరున ఖుర్బానీ ఇవ్వడం ఈ పండగ ప్రత్యేకత. బక్రీద్ పండగ సందర్భంగా ప్రతి ముస్లిం పొట్టేలు మాంసాన్ని ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ.

–మహ్మద్ నజీర్, ఇస్లాంపేట

సేవా గుణం ఉండాలి

ప్రవక్తల త్యాగానికి ప్రతీక బక్రీద్. ఆనాడు వారు అనుసరిస్తే.. నేడు పండగలా జరుపుకుంటున్నాం. ప్రవక్తల జీవితాలు, వారు అనుసరించిన విధానాలను ఆదర్శంగా తీసుకొని అనుసరించాలి. చెడు మార్గాలకు దూరంగా, మంచి, శాంతి మార్గాల్లో నడవాలి. సేవా గుణం కలిగి ఉండాలి. పండగ తర్వాత కూడా ఇదే స్ఫూర్తితో మెలగాలి.

– ఖాసీమ్ సాబ్, జామీయా మసీదు, చెంగ్రావుపేట, విశాఖపట్నం

శేష వాహనంపై తిరుమలేశుడు


శ్రీవారిని శేషవాహనంలో ఊరేగిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తిరుమలేశునికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. వేకువజామునే దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి సుప్రభాత, అర్చన అనంతరం భక్తులకు తిరుమల బాలాజీను దర్శనం కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామికి విశ్వక్సేన పూజలు, పుణ్యాహవచనం, అగ్ని ద్యానం, కుంభారాధన, నిత్య హోమం, ఉక్త హోమం, ధాతాది మూల హోమం, స్వామి వారి మూల మంత్ర హోమం, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం, అనంతరం శ్రీవారిని పెద్ద శేష వాహన సేవను అంగరంగ వైభవంగా ఊరేగించారు. సాయంత్రం వేంకటేశ్వరునికి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, పారమాత్రిక మహా శాంతి హోమం, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం పూజల అనంతరం గరుడ వాహన సేవను ఘనంగా నిర్వహించిన అనంతరం ప్రసాద వితరణ గావించారు.

ఇంటర్ అడ్మిషన్ల జోష్

- పది ఫలితాల పెరుగుదలతో ఇంటర్ విద్యకు డిమాండ్
- ఈనెల 30 వరకు రెండో విడత ప్రవేశాల గడువు
- విద్యార్థులతో కళ కళలాడుతున్న కాలేజీలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 366 జూనియర్ కాలేజీలు
- గతేడాది 58,944 మంది విద్యార్థులు చేరిక
- ఈ ఏడాది లక్ష్యం సాధించేలా పక్కా కార్యాచరణ


ఇంటర్మీడియెట్ విద్యార్థులు


హుకుంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

విద్యా సంవత్సరం	బాలురు	బాలికలు	మొత్తం
2020-21	25,330	26,314	51,644
2021-22	27,306	28,196	55,502
2022-23	29,127	28,901	58,028
2023-24	29,306	29,638	58,944

విశాఖ విద్య : ఇంటర్మీడియెట్ విద్యకు క్రేజ్ పెరిగింది. ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు రావటంతో జూనియర్ కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దీంతో జూనియర్ కాలేజీలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో గల 182 కాలేజీలు ఉండగా అనకాపల్లి జిల్లాలో 143, అల్లూరిలోని 41 కాలేజీలు అందుబాటులో ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరం ఈ నెల ఒకటి నుంచే ప్రారంభమైంది. అయితే పాఠశాలలు జూన్ 13న ప్రారంభం కావటంతో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇప్పుడిప్పుడే టీసీలను తీసుకొని కాలేజీల్లో చేరేందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30 వరకు డెడ్‌లైన్ పెట్టుకొని లక్ష్యం మేరకు అడ్మిషన్లపై ఫోకస్ పెట్టాలని ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు ఆదేశించారు.

ప్రభుత్వ కాలేజీల్లో స్పీడు పెంచాల్సిందే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో జూనియర్ కాలేజీలను అభివృద్ధి చేసి, మౌలిక వసతులు పెంపొందించింది. దీంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు క్రేజ్ పెరిగింది. నగరంలోని జైల్ రోడ్‌లో గల బాలికల కాలేజీ, డాక్టర్ వీఎస్ కృష్ణా, భీమునిపట్నం, పెందుర్తి, అదే విధంగా అనకాపల్లి జిల్లాలోని యలమంచిలి, చోడవరం అదే విధంగా అల్లూరి జిల్లాలోని జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట కాలేజీల్లో ప్రస్తుతం అడ్మిషన్లు బాగున్నాయి. మిగతా కాలేల్లో అడ్మిషన్లు అంతంత మాత్రమే ఉన్నట్లుగా తెలుస్తోంది. దీనిపై ఆయా జిల్లాల అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులకు 'ప్రైవేటు' గాలం

ఈ ఏడాది పదో తరగతిలో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత కావటంతో జూనియర్ కాలేజీలకు డిమాండ్ పెరిగింది. దీంతో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల వారు సీట్లు నింపుకునేందుకు విద్యార్థుల కోసం గాలిస్తున్నారు. కాలేజీల్లోని అధ్యాపకులకు టార్గెట్‌లు పెట్టి మరీ అడ్మిషన్ల కోసం వేట సాగిస్తున్నారు. చాలా కాలేజీల్లో వేసవిలోనే ముందస్తు అడ్మిషన్లు చేయటంతో కొన్ని మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, అదే విధంగా ప్లస్ టూ స్కూళ్లలో ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరని పరిస్థితులు ఉన్నాయి.

అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి



ఇంటర్మీడియెట్ అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రభుత్వ కాలేజీల్లో అందుబాటులో ఉన్న సీట్లన్నీ భర్తీ అయ్యేలా ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకోవాలి. అడ్మిషన్లు వివరాలను సకాలంలో స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేయాలి. విద్యార్థులంతా అడ్మిషన్ తీసుకునేలా వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలి. తరగతుల నిర్వహణపై దృష్టి పెట్టాలి.

–పి.మురళీధర్, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

కాలేజీల వారీగా సమీక్ష చేస్తున్నాం



లక్ష్యం మేరకు అడ్మిషన్లు నిర్వహించేలా కాలేజీల వారీగా సమీక్ష చేస్తున్నాం. మా జిల్లాలోని 20 ప్రభుత్వ కాలేజీల్లో ఇప్పటివరకు 1,300 సీట్లు భర్తీ అయ్యాయి. టెన్త్ పాసైన విద్యార్థులకు కొన్ని చోట్ల టీసీలు తీసుకోవటంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అలాంటి వాటిపై కూడా దృష్టి సారించి, వారి సమస్య పరిష్కరించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

– సుజాత, ఇంటర్ విద్యాధికారి, అనకాపల్లి జిల్లా

ప్రిన్సిపాళ్ల బాధ్యత తీసుకోవాలి



ప్రభుత్వ కాలేజీల్లో లక్ష్యం మేరకు సీట్ల భర్తీ అయ్యేలా తగిన కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. టెన్త్ పాసైన ప్రతీ విద్యార్థి కాలేజీలో చేరేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. దీనిపై జిల్లాలోని అన్ని కాలేజీలపై ప్రతీ రోజూ సమీక్షిస్తున్నాం. సబ్జెక్టు అధ్యాపకుల సమన్వయంతో అడ్మిషన్లపై దృష్టి సారించాలని ప్రిన్సిపాల్స్ ఆదేశించాం. మేము కూడా కాలేజీలను తరచూ పర్యవేక్షిస్తున్నాం.

– బి.రాధ, డీవీఈవో, విశాఖ జిల్లా

విశాఖ- సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం–సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–సంత్రగచ్చి(08502) స్పెషల్ ఈ నెల 19, 21, 26, 28వ తేదీల్లో రాత్రి 11.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.25 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. సంత్రగచ్చి–విశాఖపట్నం (08501) స్పెషల్ ఈ నెల 20, 22, 27, 29వ తేదీల్లో సంత్రగచ్చిలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–సంత్రగచ్చి(08506) స్పెషల్ ఈ నెల 17, 22, 24, 29వ తేదీల్లో రాత్రి 11.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.25 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. సంత్రగచ్చి–విశాఖపట్నం (08505) స్పెషల్ ఈ నెల 18, 23, 25, 30వ తేదీల్లో సంత్రగచ్చిలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కియోంజర్ రోడ్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ స్టేషన్లలో ఆగుతుంది.

వైభవంగా ఇంటి పండగలు


పాడేరులో ఘటాలను మోస్తున్న మోదమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్ల సింహాచలంనాయుడు,రమాదేవి దంపతులు


సాక్షి,పాడేరు: పాడేరు పట్టణంలోని పలువురు భక్తులు మోదకొండమ్మతల్లి ఇంటి పండగలు ఘనంగా జరుకొన్నారు. ఇటీవల పాడేరులో మోదకొండమ్మతల్లి మూడు రోజుల జాతర విజయవంతంగా జరగడంతో ఉత్సవ,ఆలయ కమిటీల ప్రతినిధులు మోదమ్మకు ఇంటి పండగను జరిపారు.ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులతో పాటు పలువురు మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మతల్లి పాదాల గుడికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం


వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో గల వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మొగలపల్లి త్రిమూర్తులు, కొల్లా అప్పలరాజు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి ఆధ్వర్యంలో అమ్మవారిని, ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ముందుగా గణపతి పూజ, పుణ్యవహచనం, పంచగవ్య ప్రాసన, దీక్షాధారణ, రుత్విక్ వరుణ, గోపూజ, పంచాయతన మండపారాధనతో పాటు సాయంత్రం లక్ష్మీ గణపతి సహిత రుద్ర మహాశౌర నారాయణ దుర్గా హవనం, దుర్గ హోమాలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో వీఆర్‌కేఎస్ కుమార్, చిట్టూరి వెంకటేశ్వరరావు, బొండాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కైలాసగిరిపై చురుగ్గా మ్యూజియం పనులు


సైన్స్ మ్యూజియం కోసం జరుగుతున్న పనులు

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం పనులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది జనవరి 2న మ్యూజియం నిర్మాణం పనులు ప్రారంభించారు. కొద్ది రోజుల పాటు చకచకా సాగిన పనులు.. మధ్యలో నిలిచిపోయాయి. మళ్లీ ఇటీవల పనులు ప్రారంభించారు. రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం కలసి మ్యూజియం గ్రాంట్ స్కీం కింద సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఎస్‌సీఏపీ) ఆధ్వర్యంలో ఇక్కడ అధునాతనమైన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం రూ 4.69 కోట్లు నిధులు ఖర్చుచేస్తున్నారు. రూ 3.75 కోట్లు నిధులను ఎస్‌సీఏపీకి సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కేటాయించగా మిగిలిన రూ.94 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మ్యూజియం కోసం కైలాసగిరిపై సుమారు ఎకరం విస్తీర్ణం గల స్థలాన్ని వీఎంఆర్‌డీఏ కేటాయించింది. మ్యూజియంలో 3డీ ఆర్ట్ గ్యాలరీ, సిలికా విగ్రహాలు, సైన్స్ వర్కింగ్ సైన్స్ వర్కింగ్ మోడల్ ప్రదర్శనలు, శాస్త్రీయ థీమ్‌లు తదితరవి ఏర్పాటు చేయనున్నారు. ఏడాదిలో మ్యూజియం నిర్మాణం పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

సందడిగా కైలాసగిరి


కైలాసగిరిపై 9డీ సినిమా థియేటర్ వద్ద సందర్శకులు


కైలాసగిరిపై గుర్రాలపై రైడ్ చేస్తున్న చిన్నారులు

ఆరిలోవ: కైలాసగిరికి రెండు రోజుల నుంచి సందర్శకుల తాకిడి పెరిగింది. అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి ఇక్కడ పచ్చని మైదానాలు, పిల్లలు ఆట స్థలాలు, పరికరాల వద్ద సందడి చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వ్యూ పాయింట్ వద్ద ప్రస్తుతం పనులు జరుగుతుండడంతో సందర్శకులు దూరంగా నిల్చుని ఫొటోలు దిగారు. ఈ వ్యూ పాయింట్ నుంచి సముద్ర తీరం, బీచ్ రోడ్డు అందాలు రుషికొండ వరకు కనిపిస్తున్నాయి. దీంతో ఇక్కడ సెల్ఫీలు తీసుకుంటూ ముచ్చటపడుతున్నారు. కొండపై శివ పార్వతుల విగ్రహాల పక్కనే ఈ వ్యూ పాయింట్ ఏర్పాటు చేశారు. కైలాసగిరిపై ప్రధాన ద్వారం వద్ద ఇటీవల '9డీ'సినిమా థియేటర్ ఏర్పాటు చేశారు. ఈ థియేటర్ మరింత సందడిగా మారింది. ఇందులో 10 నిమిషాల పాటు వేసే 9డీ సినిమాను పిల్లలు, పెద్దలు చూడడానికి ఆసక్తి కనబరిచారు. ఈ 9డి సినిమాలో 6 ఫిల్మ్‌లు ఉంటాయి. వాటిలో ఏది కావాలంటే ఆ ఫిల్మ్ చూపుతారు. 3డీ సినిమా మాదిరిగా మరింత డెవెలప్‌మెంట్‌తో 9డీ సినిమా ప్రదర్శిస్తున్నారు.